


కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రజలపై పెనుభారం

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

ఆదివారం | 15 మార్చి , 2026 | పేజీలు : 06

# నల్లగొండ జిల్లాలో డొమెస్టిక్ గ్యాస్ కొరత లేదు

## కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అమెరికాఇరాన్ యుద్ధం ప్రభావంతో కమర్షియల్ ఎల్‌పిజి గ్యాస్ స్టాక్స్ కొంత తగ్గినప్పటికీ జిల్లాలో డొమెస్టిక్ గ్యాస్ సరఫరాకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు.శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంధన సరఫరా పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.హాస్టళ్లు,కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల భోజనానికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని ప్రిన్సిపాళ్లు, సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశించారు. యుద్ధం కారణంగా ఏర్పడిన ఎల్‌పిజి గ్యాస్ కృత్రిమ సరఫరా కొరత నేపథ్యంలో గ్యాస్ సక్రమ సరఫరా,పర్యవేక్షణ విషయమై ప్రభుత్వం జిల్లా స్థాయి ఇంధన సరఫరా పర్యవేక్షణ కమిటీ ని ఏర్పాటు చేసిందని కలెక్టర్ వెల్లడించారు. యుద్ధం మొదలైనప్పటినుండి గ్యాస్ సరఫరా కొద్దిగా తగ్గినప్పటికీ గడిచిన నాలుగు రోజుల నుండి మాత్రమే జిల్లాలో సమస్య వచ్చిందని తెలిపారు. అయితే డొమెస్టిక్ గ్యాస్ సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేదని, కమర్షియల్ స్టాక్స్ మాత్రమే తగ్గాయని స్పష్టం చేశారు.గతంలో సిలిండర్ సరఫరాకు 21 రోజుల సమయం ఉండగా,ప్రస్తుతం గ్యాస్ ఏజెన్సీలు దానిని 45 రోజులకు మార్చడం జరిగిందన్నారు.డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ వినియోగానికి ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటివరకు అలాంటి కేసుల్లో 22 మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.ప్రజలు అవసరం ఉన్నప్పుడు మాత్రమే గ్యాస్ బుక్ చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఏ ఎస్‌పి రమేష్,జిల్లా పౌరసరఫరాల మేనేజర్ రాంపతి,జిల్లా స్థాయి కమిటీ సభ్యులు,కేజీబీవీ, మహాత్మ జ్యోతిబాపూలే,మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లు,సంక్షేమ హాస్టళ్ల ఆర్‌సిఓలు,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పరీక్షల వేళ.. అడ్మిషన్ల గోల..



## మల్టీ కలర్ బ్రోచర్లతో కార్పొరేట్ కాలేజీల ముందస్తు ప్రచారం

## విద్యార్థులను,తల్లిదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నం




**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఒకవైపు పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఒత్తిడిలో విద్యార్థులు నిమగ్నమై ఉంటే,మరోవైపు కార్పొరేట్ జూనియర్ కాలేజీలు మాత్రం ముందస్తు అడ్మిషన్ల జాతరను ప్రారంభించాయి.పరీక్షలు పూర్తికాకముందే విద్యార్థులను తమ వైపు తిప్పుకునేందుకు కాలేజీల ప్రతినిధులు రంగంలోకి దిగుతున్నారు.పిల్ల పుట్టకముందే కుళ్లు కొట్టించినట్టు పరీక్షలు పూర్తి అయి ఫలితాలు రాకముందే అడ్మిషన్ల కోసం హడావుడి చేయడంపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.నకిరేకల్ పట్టణంలోని పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రస్తుతం విద్యార్థుల కంటే మల్టీకలర్ బ్రోచర్ల సందడే ఎక్కువగా కనిపిస్తోంది.

**రంగుల బ్రోచర్లు.. గాలం వేసే ప్రయత్నం**

పరీక్ష రాసి బయటకు వచ్చే విద్యార్థులకు భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాల్సిన సమయంలో కార్పొరేట్ కాలేజీల ప్రతినిధులు రంగురంగుల బ్రోచర్లు అందిస్తూ ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. దూరపు కొండలు నునుపు అన్న చందంగా హైదరాబాద్,ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు తమ కాలేజీల్లో చేరితే అత్యుత్తమ ర్యాంకులు సాధించవచ్చని ప్రచారం చేస్తున్నారు.గత ఏడాది ఫలితాలు,ప్రత్యేక కోచింగ్,ఆధునిక సౌకర్యాలు అంటూ తల్లిదండ్రుల ఆశలను రెచ్చగొట్టే విధంగా ప్రచారం కొనసాగుతోంది.

**ఆఫర్ల ఆర్భాటం..తల్లిదండ్రులపై ఒత్తిడి**

ముందస్తు అడ్మిషన్ తీసుకుంటే భారీ రాయితీలు, సీట్లు పరిమితం..వెంటనే నమోదు చేసుకోండి అంటూ ఆకర్షణీయ హామీలతో విద్యార్థులు, తల్లిదండ్రులను ఒప్పించే ప్రయత్నం జరుగుతోంది. ఫలితాలు వచ్చిన తర్వాత విద్యార్థి ప్రతిభను బట్టి నిర్ణయం తీసుకోవాల్సింది పోయి, చెట్టు పుట్టకముందే కొమ్మలు నరికినట్టు రెండు నెలల ముందే అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించడం విమర్శలకు దారితీస్తోంది. దీంతో తల్లిదండ్రులు గందరగోళానికి గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

**నియంత్రణేది?.. అధికారుల మౌనం**

పరీక్షా కేంద్రాల పరిసరాల్లో నిబంధనలు అమలులో ఉన్నప్పటికీ కాలేజీల ప్రతినిధులు గుంపులు గుంపులుగా చేరి ప్రచారం చేయడంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పరీక్షల సమయంలో విద్యార్థులను ప్రశాంతంగా ఉండనీయకుండా భవిష్యత్తుపై అయోమయం సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు.అమ్మ పెట్టదు..అడుక్కు తిననివ్వదు అన్నట్లుగా విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్న ఈ విధానాన్ని తక్షణమే అరికట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న ఈముందస్తు అడ్మిషన్ హోరుపై నియంత్రణ తీసుకురావాలని మేధావులు కోరుతున్నారు.



# సాగు, తాగునీరే ప్రభుత్వ లక్ష్యం

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య


**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట పట్టణంలోని తోపుగని చెరువు గోదావరి జలాలతో నిండి అలుగు పోస్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గంగమ్మ తల్లికి హారతి ఇచ్చి, జలాలకు నమస్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో ఉన్న ప్రతి చెరువును నింపి ప్రజలకు తాగు నీరు, రైతులకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలోని తోపుగని చెరువు నిండటంతో పాటు, పరిసర ప్రాంతాల్లోని మిగతా చెరువులను కూడా నింపేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ముఖ్యంగా యాదగిరిగుట్ట నుండి వంగపల్లి, రామాజీపేట, తాళ్లగూడెం తదితర 15కు పైగా గ్రామాలకు సాగునీరు అందేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ బిక్షపతి, మున్సిపల్ చైర్ పర్సన్ వాణిభరత్ గౌడ్, కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేష్, పేరబోయిన, సత్యనారాయణ, మధు పాల్గొన్నారు.

# కంచె చేను మేసినట్లు డీలర్ వ్యవహారం...

## బియ్యం వైట్‌కు బదులు కాంట బాట్లు, బకెట్లతో తూకం...

## తక్కువ రేటుకు బియ్యం కొని సొమ్ము చేసుకుంటున్న డీలర్..

## చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు



**ప్రజాపక్షం/డిండి;** కంచె చేను మేసినట్లు ఆ గ్రామ డీలర్ వ్యవహారంతో ప్రజలు, లబ్దిదారులు రేషన్ తినలేని స్థితిని స్వయంగా ఆ గ్రామ డీలర్ వ్యవహారం ఉందని లబ్దిదారులు చెప్పిన సమాచారం మేరకు వివరాల్లోకి వెళితే డిండి మండల పరిధిలోని బ్రహ్మణపల్లి గ్రామ డీలర్ తను ప్రభుత్వ పంపిణి బియ్యం ప్రజలకు సరఫరా చేసే విషయంలో ప్రజలకు బియ్యం ఇవ్వకుండా కేవలం డబ్బులిచ్చి పంపుతునాడని సదరు డీలర్ కేవలం బియ్యం కూడా బస్తాలో తూకం వేయకుండా లబ్దిదారుల బియ్యానికి సరిపడా తూకం బాట్లను, బకెట్‌లను వాడి బియ్యం రసీదు తీస్తూ ప్రజా పంపిణి బియ్యాన్ని పక్కదారి పట్టిసున్నారు. సదరు డీలర్ తక్కువ ధరలకు లబ్దిదారుల నుండి బియ్యాన్ని తీసుకొని ఎక్కువ ధరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నాడని కాపలా దారుడే ఖాజేసిన విధంగా బియ్యం సరఫరాలో డీలర్ వ్యవహారం ఉందని అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, లబ్దిదారులు అధికారులను కోరుతున్నారు.

**సివిల్ సప్లై డిప్యూటి తహశీల్దార్ ముబిన్ వివరణ...**

సదరు బ్రాహ్మణపల్లి డీలర్ ప్రజా పంపిణి సరఫరా బియ్యం పంపిణి విషయంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని లబ్దిదారులు తమ దృష్టికి తీసుకొచ్చారని విచారణ చేసి, అక్రమాలు జరిగినట్లు నిరూపణ అయితే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



## కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలాభివృద్ధి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే సమగ్ర గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి, మాజీ జడ్పిటిసి పెండెం శ్రీనివాసగౌడ్ లు అన్నారు. శనివారం మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ ఐదు లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను సర్పంచ్ నందిపాటి కవిత జానయ్య తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యర్లగోర్ల మదార్, పోటు సైదులు, పోలే స్వామి, గౌతమి, సరిత, రెణబోతు సత్యావతి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## బ్లాక్‌లో గ్యాస్ విక్రయిస్తే చర్యలు




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గరిడేపల్లి ఎస్ఐ చలిగంటి నరేష్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ గొడౌన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడిన ఎస్ఐ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు విక్రయించరాదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కొంతమంది సామాజిక మాధ్యమాల్లో గ్యాస్ కొరత అంటూ తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## ప్రారంభమైన పది పరీక్షలు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. గరిడేపల్లి ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు గానూ 130 మంది, కస్తూరిభా బాలికల విద్యాలయంలో 107 మంది విద్యార్థులకు 107 మంది విద్యార్థులు హాజరయ్యారని మండల విద్యాధికారి చత్రునాయక్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ చలిగంటి నరేష్ తెలిపారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పదవ తరగతి వార్షిక పరీక్షలు శనివారం తెలుగు పరీక్షతో ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 69 పరీక్ష కేంద్రాలలో 12,355 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 12,342 మంది విద్యార్థులు హాజరు కాగా 13 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. 9 మంది ప్రైవేట్ విద్యార్థులకు గాను 6 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇట్టి పరీక్షకు 4 స్క్వాడ్ బృందాలు, పరీక్షల విభాగం అధికారులు ముగ్గురు 37 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారని చెప్పారు.

# ప్రశాంతంగా ముగిసిన తొలి పరీక్ష

### కోదాడలో పదో తరగతి తెలుగు పరీక్షకు ఒకే ఒక్కడు గైర్హాజరు



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో తెలుగు పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు మండల విద్యాధికారి సలీంషరీఫ్ తెలిపారు. మొత్తం 11 పరీక్ష కేంద్రాలకు 2441 మంది విద్యార్థులు ఉండగా, 2440 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు, ఒకే ఒక్క విద్యార్థి గైర్హాజరైనట్లు తెలిపారు. తేజ స్కూల్‌లో 174 మందికి అందరు హాజరయ్యారు. జడ్పి బాలుర ఉన్నత పాఠశాలలో 239 మందికి 238 మంది విద్యార్థులు హాజరైనట్లు, ఒకరు గైర్హాజరయ్యారు. ఎన్ఆర్ఎం ప్రైమ్ స్కూల్‌లో 192 మందికి 192 మంది, ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో 240 మందికి 240 మంది, సిటి సెంట్రల్ స్కూల్‌లో 240 మందికి 240 మంది, కెటిఎస్ పాఠశాలలో 239 మందికి 239 మంది, సిసిరెడ్డి స్కూల్‌లో 230 మందికి 230 మంది, ఎస్‌వి స్కూల్‌లో 198 మందికి 198 మంది, జడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో 230 మందికి 230 మంది, శ్రీవైష్ణవి స్కూల్‌లో 230 మందికి 230 మంది హాజరయ్యారు. అదే విధంగా కెటిఎస్ పాఠశాలలో సప్లమెంటరీ పరీక్షలకు 7 విద్యార్థులకు ఆరుగురు హాజరైనట్లు,ఒకరు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# దారి తప్పతున్న డోమోస్టిక్ సిలిండర్లు



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని గృహ అవసరాలకు వినియోగించే డోమోస్టిక్ గ్యాస్ సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీల బాయ్‌లకు ముడుపులు ఇచ్చి రెస్టారెంట్ హోటల్ యజమానులకు వ్యాపార వినియోగానికి వాడుకుంటున్నారు. గృహ అవసరాలకు ఉపయోగించే సిలిండర్లు గ్యాస్‌కు తక్కువ ధర ఉండటంతో వ్యాపారులు డొమెస్టిక్ సిలిండర్లు వాడటం మొదలుపెట్టారు. గ్యాస్ బాయ్‌లకు వంద, రెండు వందలు ఎక్కువ ఇచ్చి డొమెస్టిక్ సిలిండర్లు వ్యాపారానికి వాడుతున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో గ్యాస్ బుక్ చేసిన సమయానికి గ్యాస్ అందడం లేదు, హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్లు వాడాలని నిబంధనలు ఉన్న వాటిని గాలికి వదిలేస్తున్నారని అన్నారు. కాగా పర్యవేక్షించాల్సిన అధికారులు కళ్లముందు డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్న ఆ యాజమానులపై చర్యలకు పూనుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్ల వాడకంపై చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

# సాంఘిక, పద్య నాటికలు భవిష్యత్తు తరాలకు దోహదం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మన సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించేందుకు సాంఘీక, పద్య నాటికలు ఎంతగానో దోహదపడుతాయని రిటైర్డ్ ఉపాధ్యాయుడు, కవి, రచయిత వారణాసి ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో ఆరవ రోజు శనివారం జాతీయ స్థాయి పద్యనాటక, సాంఘీక నాటక పోటీలు, నృత్యాలను ఆయన తెలంగాణ నాటక సమాఖ్య సూర్యాపేట ఉపాధ్యక్షుడు విలకత్తుల పుల్లయ్యతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. పద్యాల ద్వారా తెలుగు భాషలోని మాధుర్యం, స్పష్టమైన ఉచ్చారణ, పదజాలంపై పట్టు పెరుగుతుందని అన్నారు. నాటికల్లోని ఇతివృత్తాలను క్రమ శిక్షణ, సామాజిక బాధ్యత, మానవీయ సంబంధాల పట్ల అవగాహన కలిగిస్తాయన్నారు. ' శ్రీ ఖడ్గ తిక్కన' అనే పద్య నాటికను, ' ఇది కొత్త కథ' అనే సాంఘీక నాటికను డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీసాయిబాబా నాట్య మండలి విజయవాడ వారిచే ప్రదర్శించారు. అనంతరం నటీనటులను, నిర్వాహకులను శాలువాలతో సన్మానించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు, అధ్యక్షుడు రామావతరాం, కార్యదర్శి పులి కృష్ణమూర్తిశర్మ, వెంకటలక్ష్మీ నారాయణశర్మ, సాయిలు, సత్యనారాయణచారి, లక్ష్మ య్య, ఎల్లయ్య, సత్యనారాయణ, శ్రీనివాసరావు, రాఘవయ్య, శైలజ, సరస్వతి, నాగమణి, ఉపేందర్, బాబురావు, వీరప్రతాప్, రాజారం తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం హుజూర్‌నగర్ మండలపరిధిలోని లింగగిరి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య నిపుణులతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మేడి సునిత రమణ ప్రారంభించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, స్త్రీల, దంత, ఎముకల, కన్ను చిన్న పిల్లల వైద్య నిపుణులు మండల వ్యాప్తంగా వచ్చిన రోగులను పరీక్షించి అవసరమైనటువంటి మందులను పంపిణీ చేశారు. శాస్త్ర చికిత్సలు అవసరమైన వారిని సూర్యాపేట జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి సుమారు 215 మంది రోగులు హాజరైనట్లు మండల వైద్యాధికారి వేణుగోపాల్‌నాయక్ తెలిపారు. ఈకార్యక్రమంలో చలమల సతీష్, రాఘవయ్య, సిహెచ్‌వో పద్మ, సూపర్‌వైజర్ పద్మ, ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి, శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజా ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజాప్రభుత్వం ద్వారానే సొంతింటి కల నెరవేరిందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. మిర్యాలగూడ మండలం కేశవాపురం, రామోజీతండాలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్లను శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పేదవాళ్లకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వలేకపోయిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. నియోజకవర్గంలో 3500 ఇండ్లు పేదలకు అందించేందుకు చర్యలు చేపడ్తామన్నారు. పేదలకు సన్న బియ్యం, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపిఐ శిక్షణా తరగతులకు హాజరైన ప్రజాప్రతినిధులు



**ప్రజాపక్షం/చండూరు:** ఇటీవల జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులుగా పోటీ చేసి విజయం సాధించిన సర్పంచ్‌లు , ఉప సర్పంచ్‌లు ,మున్సిపల్ కౌన్సిలర్లు కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచలో జరిగిన సిపిఐ ప్రతినిధుల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులకు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ నారాయణను మర్యాద పూర్వకంగా కలువడంతో అభినందించి ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని సూచించారు . ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండలం కొట్టాల సర్పంచ్ లింగయ్య , చండూరు మండలం కస్తాల సర్పంచ్ లేదన్న సత్యనారాయణ, చండూరు మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ కౌన్సిలర్ జెల్ల ధనమ్మ , చండూరు మండలం దోనిపాముల ,పుల్లెంల , కొండాపురం ఉప సర్పంచ్‌లు తిప్పర్తి రాములు , సిహెచ్ ఊషయ్య , గడ్డం యాదయ్య పాల్గొన్నారు.

## ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 16 నుంచి జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఉద్యోగాల భర్తీ కోసం చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందించి మాట్లాడారు. 2024 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ సమావేశంలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ విషయమై ఎమ్మెల్యే గలం విప్పాలని కోరారు. ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి మాట ఇచ్చారని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సూచించారు. ఆయన వెంట యర్రబెల్లి దుర్గయ్య, దొనేటి శేఖర్, పోలగాని వెంకటేష్‌గౌడ్, లవకుమార్, రవి, రాంబాబు, నాగార్జున, అనూష, పల్లవి, స్వప్న, గాయత్రి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.





## మున్సిపల్ చైర్మన్ ,కౌన్సిలర్లకు ఘనంగా సన్మానం

**ప్రజాపక్షం/చండూరు:** ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో చండూరు మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన డాక్టర్ కోడి శ్రీనివాసులు , వైస్ చైర్మన్ భూతరాజు దశరథ ,7 వార్డు కౌన్సిలర్ కోడి సుష్మా వెంకన్న లను శనివారం తమ తోటి 199293 ఎస్ఎస్‌సి బ్యాంచ్ మిత్రులు కలిసి ఘనంగా సన్మానించారు. ఎస్ఎస్‌సి బ్యాచ్‌కు చెందిన మిత్రులు సన్మానించి అభినందించడం పట్ల మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు , వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , కౌన్సిలర్ కోడి సుష్మావెంకన్న సంతోషం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మిత్రులు పాటల వెంకన్న, భూతరాజు ఆంజనేయులు , సాపిడి రాములు ,నాగిళ్ల శంకర్ , వర్కాల క్రిష్ట , మొండికత్తి నర్సింహ్మపాల్గొన్నారు.

## విద్యార్థుల చదువుకు ఖర్చు చేయడంలో ప్రభుత్వానికి మనసు రావడం లేదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మూసీ సుందరీకరణ కోసం వేల కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం విద్యార్థులు చదువుకోవడానికి మాత్రం ఫీజులు ఇవ్వడానికి మనసు రావడం లేదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి, గాంధీ విగ్రహం కట్టడానికి డబ్బులు ఉంటాయి కాని పేద విద్యార్థులు చదువుకోవడానికి ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వడానికి మనసు రావడం లేదన్నారు. 22 లక్షల మంది విద్యార్థుల ప్రయోజనాల కంటే మూసీ సుందరీకరణ, మహాత్మగాంధీ విగ్రహం ముఖ్యమా అన్నారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థుల గురించి పట్టించుకోకుండా మూసీని సుందరీకరణ చేస్తామనడం సిగ్గుగా ఉందన్నారు.

## ప్రారంభమైన పది పరీక్షలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** 2025/26 సంవత్సరానికి గాను పదవ తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు పుర పట్టణంలో పరీక్షా కేంద్రాలు జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో 200, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 159 కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 213 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. మొదటిరోజు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి గైర్హాజర్ అయినట్లు చీఫ్ ఎగ్జామినర్ ఈ యాదగిరి తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ నాగవర్ధన్ రెడ్డి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇల్లు

**ప్రజాపక్షం/బీబీనగర్ :** అర్హులైన పేదలందరికీ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని గ్రామ సర్పంచ్ బింగి అలివేలు మంగ అన్నారు. శనివారం మండలంలోని గూడూరు గ్రామంలో బండిరాల పద్మ పాండు దంపతులకు మంజూరైన ఇందిరామ్మ గృహప్రవేశంన సందర్భంగా లబ్ధిదారులకుపట్టు వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఈసారపు అచ్చయ్య గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు పాలకూర శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



## పది పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ నిషేధాజ్ఞలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పదవ తరగతి వార్షిక పరీక్షలు శనివారం నుండి ప్రారంభం కాగా జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్, జిల్లా పరిషత్ పాఠశాల నందు గల పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్‌పి కె నరసింహ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, పరీక్షా సరళిని పరిశీలించి విధులు నిర్వహిస్తున్న ఎగ్జామినేషన్ సెంటర్ సిబ్బందికి, పోలీసు సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. పరీక్షా కేంద్రాల వద్ద నిషేధ ఆజ్ఞలు 144 సెక్షన్ అమలు చేస్తున్నామని తెలిపారు. పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా పరీక్షలు కొనసాగుతాయన్నారు. నిషేధ ఆజ్ఞలు ఉన్నందున పరీక్ష కేంద్ర పరిసరాల్లో లౌడ్ స్పీకర్లు, మైకులు, వాహన హారన్‌లు ఉపయోగించరాదని సూచించారు. జిరాక్స్ సెంటర్స్, ఇంటర్నెట్ కేంద్రాలు మూసివేయాలన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సకాలంలో హాజరుకావాలని, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. వాహన పరిమితికి మించి ఎక్కువ మంది విద్యార్థులను వాహనాల్లో తరలించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పట్టణ ఎస్‌ఐలు ఐలయ్య, శివ తేజ, ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం, ఎగ్జామినేషన్ సిబ్బంది ఉన్నారు.

## చెత్త సేకరణలో మున్సిపాలిటీకి సహకరించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** చెత్త సేకరణలో మున్సిపాలిటికి పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. శనివారం పట్టణంలోని 33వ వార్డులోని గణేష్ చౌరస్తాలో జరిగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాగుల వాసుతో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. వార్డులో డ్రైనేజీలు శుభ్రం చేయాలని ప్రజల నుంచి ప్రతి రోజు చెత్త సేకరణ చేయాలని సిబ్బందికి సూచించారు. దోమల నివారణకు ప్రతి వార్డులో కూడా ఫాగింగ్ చేయడం జరుగుతుందని, ఏ వార్డులోనైనా ఫాగింగ్ జరగకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఖాళీ స్థలాల్లో కంప చెట్లు పెరగకుండా యజమానులు జాగ్రత్తలు వహించాలన్నారు. ఖాళీ స్థలాలలో చెత్తాచెదారంలో వేయవద్దని అన్నారు. ఖాళీ స్థలాలకు పెన్సింగ్ వేయించుకోవాలని పరిశుభ్రంగా ఉంచుకోవాలని యజమానులకు చెప్పారు. మున్సిపల్ కమీషనర్ హనుమంత రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగుండ్ల శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని శ్రీసాయి త్రివేణి డిగ్రీ, పిజి కళాశాల కరస్పాండెంట్ పెసర జనార్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో శనివారం శ్రీసాయి త్రివేణి డిగ్రీ, పిజి కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫెర్వెల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఆ దిశగా ప్రణాళిక రూపొందించుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దిర్శనపు అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ తన్నీరు ఉపేందర్, అధ్యాపకులు పి. శ్రీనివాస్ రెడ్డి, జి. వెంకట్‌రెడ్డి, గంజికుంట్ల గోపీనాథ్, ఉయ్యాల నర్సయ్య గౌడ్, బి నాగేశ్వరరావు, వెంకట్‌గౌడ్, మల్లారెడ్డి, మల్సూర్, రమేష్, అంజయ్య, రవళి పాల్గొన్నారు.

## కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) జాతీయ ఉపాధ్యక్షులు వనమాల కృష్ణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో టియుసిఐ రెండు రోజుల శిక్షణా కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షులు కె సూర్యం అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్ పద్మ అమరులకు నివాళుల సందేశాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న వారికి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నరేందర్, రాజన్న, రామయ్య, హన్మేష్, వెంకటేష్, ముత్తెన్న, యాకూబ్ షావలి, ప్రవీణ్ పాల్గొన్నారు.





## బీటీ రోడ్డు మంజూరుకు ఎమ్మెల్యే హామీ

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండలంలోని చందెపెల్లి హబిటేషన్ గ్రామమైన తొడిగలోని బావికి పిడబ్ల్యూ రోడ్డు నుండి ఒక కిలోమీటర్ బిటి రోడ్డు వేయించాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను చందెపల్లి సర్పంచ్ బోట్ల నాగేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వగా స్పందించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య త్వరలో మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోట్ల నగేష్, ఉపసర్పంచ్ ఏనుగు అంజి రెడ్డి పాల్గొన్నారు.




## గృహ కార్మికుల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గృహ కార్మికుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ కాస అనసూర్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 11 లక్షల మంది గృహ కార్మికులు, సూర్యాపేటలో 2000కు పైగా గృహ కార్మికులు ఉన్నారన్నారు. వారికి సరైన జీతం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక మహిళలకు సామాజిక భద్రత కూడా లేదన్నారు. వారికి సరైన గుర్తింపు, గౌరవం కావాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్ళి సిఎం రేవంత్ రెడ్డికి పోస్టు కార్డ్స్‌ను పంపించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్ళు నీలిమ, సుహాసిని, దివ్య, లక్ష్మి , భావన పాల్గొన్నారు.

## మొక్కల్ని జాగ్రత్తగా పెంచాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నర్సరీలో మొక్కల్ని జాగ్రత్తగా పెంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. శనివారం మున్సిపాలిటి పరిధిలో 2వ వార్డులో ప్రజాపాలన పట్టణ ప్రణాళికలో భాగంగా శ్లోక స్కూల్ సమీపంలోని మున్సిపాలిటి నర్సరీని ఆమె సందర్శించి మాట్లాడారు. జూన్ నెల నుంచి ఇంటింటికి మున్సిపాలిటి ద్వారా పూలు, పండ్ల మొక్కలు సరఫరా చేస్తామన్నారు. ప్రజలు మొక్కలను తమ ఇంటి ఆవరణలో పెంచుకోవాలని కోరారు. మున్సిపాలిటిలో ప్రస్తుతం ఒక లక్ష 81 వేల మొక్కలు పెంచుతున్నామని, ఇంకా తొమ్మిది నర్సరీలలో మూడు లక్షల వరకు మొక్కలను పెంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ హన్మంతరెడ్డి, స్థానిక కౌన్సిలర్ తన్వీర్ హుస్సేన్, శానటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టిపిఓ సోమయ్య, ఏఈ రాజిరెడ్డి, శివప్రసాద్, వసీమ్ పాల్గొన్నారు.

## స్వచ్ఛత సైనికులుగా మారాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛత సైనికులుగా మారాలని కౌన్సిలర్ బత్తుల ఝాన్సీరాణి రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని 43వ వార్డులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డులో వారు పర్యటించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు తడి, పొడి చెత్తలను వేరుచేసి మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. చెత్తను డ్రైనేజీ, బహిరంగ ప్రదేశాలలో పడేయడం వల్ల దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడతారన్నారు. ఆర్‌పి యశోద, వార్డు ఆఫీసర్ రవితేజ, జవాన్ శ్రీనివాస్, మిన్నయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గాలికుంటు నివారణకు టీకాలు

**ప్రజాపక్షం/నకిరేకల్(కట్టంగూర్) :** మండలంలో గాలికుంటు వ్యాధి నివారణకు పశువైద్య సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాల కార్యక్రమం కొనసాగుతోంది.ఈనెల 10న ప్రారంభమైన ఈకార్యక్రమంలో భాగంగా దుగినెవెల్లి గ్రామంలో 86 గేదెలు,28 ఆవులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి,ఎల్ఎస్ఏ అరుణా, గోపాలమిత్ర చెరుకు శ్రీనివాస్,ఓఎస్ కిరణ్, రేణుక పాల్గొన్నారు.





## పెన్షనర్స్ రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం

ప్రజాపక్షం/నకిరేకల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెరి వెంకట్ రెడ్డి శనివారం నకిరేకల్‌లోని సంఘ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నకిరేకల్ శాఖ అధ్యక్షుడు కె. పాపిరెడ్డి ఆయనను ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కందుల సోమయ్య,గౌరవ అధ్యక్షులు వి.రామలింగం,పోతుల రామచంద్రయ్య,వెంకట్ నారాయణ,కె.భిక్షం రెడ్డి,కోశాధికారి చిక్కు రవీందర్,ప్రచార కార్యదర్శి శివ కోటి ఆంజనేయులు,కార్యవర్గ సభ్యులు కె.రామ్ రెడ్డి, కె.ప్రభాకర్,పి.రామలింగం పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే



ప్రజాపక్షం/నకిరేకల్: ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నర్సింహపురం గ్రామ మాజీ సర్పంచ్ మాలె పవన్ రెడ్డి,కొత్తపేటకు చెందిన ఉయ్యాల మంగమ్మ కుమారుడు,బాబాసాహెబ్ గూడెంకు చెందిన భూపాతి వెంకటనారాయణ కుమారుడు,నకిరేకల్‌కు చెందిన గడగోజు సతీష్ కుమార్ వివాహాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా గాయని వేముల పుష్ప,సర్పంచ్ వీరార్జున్ రెడ్డి,చౌగోని శ్రీనివాస్,గుత్తా మాధవరెడ్డి,గాజుల సుకన్య శ్రీనివాస్,రాచకొండ సునీల్,లింగాల వెంకన్న,ఉగ్గిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటినుండి ఒంటిపూట బడులు

ప్రజాప్రక్షం/నకిరేకల్ : రాష్ట్రంలోని ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని,అన్ని ప్రభుత్వ,ఎయిడెడ్,ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 16 సోమవారం నుండి ఏప్రిల్ 23 వరకు ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఒంటిపూట బడులు నిర్వహించబోతున్నట్లు నకిరేకల్ ఎంఈఓ మేక నాగయ్య శనివారం తెలిపారు.ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలల పనిచేస్తాయని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు.పదోతరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న స్కూళ్లు,పరీక్షలు జరిగే రోజుల్లో మాత్రమే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయని ఆయన పేర్కొన్నారు.పరీక్షలు లేని రోజుల్లో పాఠశాలలు ఉదయం పూట యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

## వేసవి కాలంలో నీటిని పొదుపుగా వాడుకోవాలి

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; వేసవి కాలంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో పాడైపోయిన పాత మోటర్‌ను గ్రామ పంచాయతీ సిబ్బంది చేత తొలగింపు చేసి నూతన మోటర్‌ను ఏర్పాటు చేయించి వార్డు ప్రజలకు నీటి సదుపాయాన్ని కల్పించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య, వార్డు సభ్యులు వస్కుల స్వప్న శ్రీను, అందుగుల పూజ వెంకటేష్, ప్రభు, కోటయ్య, వెంకటేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది అంజి, మధు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు సంపూర్ణ హాజరు



ప్రజాపక్షం/నకిరేకల్: పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి.మండలంలోని నాలుగు కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 814 మంది విద్యార్థులు నమోదు కాగా,812 మంది హాజరయ్యారు.ఇద్దరు పీహెచ్‌సీ విద్యార్థులకు మినహాయింపు ఉండటంతో అన్ని కేంద్రాల్లో 100 శాతం హాజరైనట్లుగా పరిగణిస్తున్నామని మండల విద్యాధికారి మేక నాగయ్య తెలిపారు.పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని చెప్పారు.

పరీక్షా కేంద్రాల్లో డిఎస్‌పి తనిఖీ

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగానిర్వహించేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి సూచించారు. శనివారం నకిరేకల్,కట్టంగూరు మండలాల్లోని పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు.వారి వెంట నకిరేకల్ సిఐ హరిబాబు, నకిరేకల్ ఎస్ఐలు వీరబాబు,కృష్ణమాచారి,కట్టంగూర్ మునుగోటి రవీందర్ ఉన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో పదవతరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని 15 పాఠశాలలకు చెందిన 417 మంది బాలబాలికలు పది పరీక్షలు వ్రాస్తున్నారు. ఇందులో 238 మంది బాలురుండగా, 179 మంది బాలికలున్నారు. పట్టణంలో విద్యార్థుల కోసం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రీన్‌గ్రోవ్, న్యూలిటిల్ ఫ్లవర్ స్కూల్ లున్నాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 130, గ్రీన్ గ్రోవ్ స్కూల్‌లో 137, న్యూలిటిల్ ఫ్లవర్‌లో 150 మందికి విద్యా శాఖ ఏర్పాట్లు చేసింది. కాగా నేడు జరిగిన తెలుగు పరీక్షలో 1 విద్యార్థి గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి సైదానాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పూర్తి బందోబస్తు ఏర్పాటు చేసింది. విద్యార్థులకు వైద్య సేవలను అందించడానికి కూడా పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు చేశారు.

## స్థానిక పరిశ్రమల స్థాపనతోనే ప్రాంతీయ అభివృద్ధి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: స్థానిక పరిశ్రమల స్థాపనతోనే ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్ధార్థ అన్నారు. శనివారం మండలంలోని ఆలగడప శివారులో నూతనంగా ప్రారంభించిన వెలిచేటి రామకృష్ణ రైస్ మిల్లును ఆయన సందర్శించి మిల్లులోని అత్యాధునిక యంత్రాలను పరిశీలించి యాజమాన్యానికి అభినందనలు తెలిపి మాట్లాడారు. భారీ రైస్ మిల్లులు స్థాపించడ వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధర లభించడమే కాకుండా త్వరితగతిన మిల్లింగ్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో బీఆర్ఎస్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో వెలిచేటి రామకృష్ణ, తుమ్మల ఫణికుమార్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## నీటిని పొదుపుగా వాడాలి

ప్రజాపక్షం/రామన్నపేట : వేసవి దృశ్య మంచినీటిని వృధా చేయకుండా, సాగు, తాగు నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలని నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఈఈ బొడ్డు సురేందర్ రావు సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ వాన కాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం మూలంగా భూగర్భ జలాలు అమాంతం పెరిగిపోయిందని, ఆ నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తాగు సాగునీటిని పొదుపుగా వాడకొని పక్షంలో భూగర్భ జలం పెరిగిన స్థాయిలోనే అడుగంటే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ జిల్లాలో పలు ప్రాంతాలలో భూగర్భ జలాలు అడుగంటుతున్నట్లు వార్తాపత్రికల్లో వార్తా కథనాలు వస్తున్నాయని అన్నారు. నల్లాల ద్వారా వచ్చే నీటిని వృధా చేయరాదని, నల్ల నీటిని పట్టుకున్న తర్వాత మిగతా నీటిని వృధాగా మురికి కాలువల్లోకి వదిలేయకుండా నల్లను బంద్ చేయాలని ఆయన సూచించారు.

## విద్యుత్ కోతలు, లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని ఆందోళన



ప్రజాపక్షం/తుర్కపల్లి : తుర్కపల్లి మండల కేంద్రం ఆధ్వర్యంలో రైతులు ఎదుర్కొంటున్న లోవోల్టేజ్ సమస్యలు అప్రకటిత విద్యుత్ కోతల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ తుర్కపల్లి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్, పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తూ స్థానిక కరెంట్ ఆఫీస్‌లో వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సరైన వ్యవసాయ విద్యుత్ సరఫరా అందడంలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని, తుర్కపల్లి మండలంలోని అనేక గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని, దీని వల్ల రైతుల మోటార్లు తరచుగా కాలిపోతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మి నారాయణ గౌడ్, జిల్లా మీడియా కో కన్వీనర్ భానోత్ శంకర్ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు సైదులు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ యాదవ్ పాల్గొన్నారు.



## పది పరీక్షకు నూరుశాతం హాజరు

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; శనివారం ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షకు మండల పరిధిలోని పదవ తరగతి విద్యార్థులు 730 కి గాను 730 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి ఆర్. నాగేశ్వర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈసంవత్సరం సిబిఎసిఈ తరహాలో ఒక పరీక్షకు, మరొక పరీక్షకు మధ్యన సుమారు రెండు, మూడు రోజులు గడువు ఉండడంతో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తారని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెక్షన్ 144 విధించినట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ పేర్కొన్నారు.

## పరీక్ష ఎలా రాశావ్ నాన్న..?



ప్రజాపక్షం/నకిరేకల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా విద్యార్థుల కంటే తల్లి దండ్రులే ఎక్కువ ఆత్రుతతో ఎదురుచూస్తున్న దృశ్యాలు పరీక్ష కేంద్రాల వద్ద కనిపిస్తున్నాయి. నకిరేకల్ పట్టణంలోని ఒక పరీక్షా కేంద్రం వద్ద అలాంటి హృద్యమైన క్షణం ప్రజాపక్షం కెమెరాకు చిక్కింది. పరీక్ష ముగిసిన వెంటనే బయటకు వచ్చిన తన కుమారుడిని చూసిన తండ్రి,అతడు రాసిన ప్రశ్నాపత్రాన్ని చేతిలోకి తీసుకుని పరిశీలిస్తూ, పేపర్ ఎలా వచ్చింది? చదివిన ప్రశ్నలే వచ్చాయా? అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాశావా? అంటూ ఆతృతగాఅడిగాడు.ఈ తండ్రి మాత్రమే కాదు..ప్రతి తల్లిదండ్రి కూడా ఇదే భావంతో పరీక్ష కేంద్రాల వద్ద వేచి ఉన్నారు.తమ పిల్లలు బాగా చదివి మంచి భవిష్యత్తు సాధించాలని ఎన్నో ఆశలు పెట్టుకుని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

## రంజాన్ కానుక అందజేత



ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా శనివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత ఆధ్వర్యంలో మాజీ ఎంపిపి దేవ కృష్ణారెడ్డి చేతుల మీదుగా ముస్లిం మైనార్టీ సోదర సోదరీమణులకు అందజేయడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ సోదరభావం, ఐక్యతకు ప్రతీక అని ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గద్వాల ఉపేందర్, గ్రామశాఖ అధ్యక్షులు ఎర్రయ్య, నాయకులు సునీల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, డేవిడ్, సాయి, చింటూ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని పలు నిరుపేద కుటుంబాలకు అమీర్‌అలీ ఫౌండేషన్ సహకారంతో బియ్యం, నిత్యావసర సరుకులను శనివారం హైకోర్టు న్యాయవాది, సోషల్ సర్వీసర్ అర్షనైజర్ హమీద్ షేక్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు అమీర్ అలీ ఫౌండేషన్ అందిస్తున్న దాతృత్వం ఎనలేనిదన్నారు.



## బహుజన రాజ్యాధికార యుద్ధభేరి సభను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/గుండాల;** బహుజన రాజ్యాధికార యుద్ధ భేరి ఛలో చౌటుప్పల్ సభను విజయవంతం చేయాలని శనివారం బిఎస్పి ఆలేరు నియోజకవర్గ అధ్యక్షులు గడ్డం శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15న కాన్సీరామ్ జన్మదిన సందర్భంగా నిర్వహించే బహుజన రాజ్యాధికార సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## పెళ్లి కానుక అందజేత



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల పరిధిలోని పైల్వాన్ పురం గ్రామానికి చెందిన ఆడపడుచుకు పెళ్లి కానుకగా శనివారం ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత టీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో బోయ శారద స్వామి కుమార్తె అనూష వివాహ వేడుకలు ఎంఎంఎస్ ఫంక్షల్‌హాల్‌లో కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఏజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన వధువుకు అందజేశారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

## జనసేన ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా నాయకులు ఘనంగా నిర్వహించారు. భువనగిరి జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులు జనసేన జెండా ఆవిష్కరించారు. తెలంగాణ రాష్టంలో పేదల కష్టసుఖల్లో జనసేన పాలు పంచుకొంటూదని అన్నారు. జనసేన తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం అడహక్ కమిటీ సభ్యులు కిరణ్, జిల్లా నాయకులు రమేష్,పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద శనివారం ట్రాఫిక్ పోలీసులు ఆటో డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. అరైవ్ అలైవ్ నినాదంతో సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు.



## లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో స్పార్క్ 2025-26




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో గల లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో శనివారం స్పార్క్ 2025/26 వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్, ఎథికల్ కెరియర్ గైడెన్స్ కోచ్ జి.శివప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సమాజాన్ని సోషల్ మీడియా శాసిస్తుందని, ఇలాంటి తరుణంలో మన పిల్లలకు దానికి బానిస కావడం వల్ల జరిగే దుష్పరినామాల గురించి, తద్వారా పిల్లల భవిష్యత్తు ఏ విధంగా ఇబ్బందుల్లో పడుతుందని, తల్లిదండ్రులు కూడా వాటి నివారణలో మంచి పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు పిల్లల మనస్సులను కలుషితం చేసి, వారిని వారి లక్ష్యానికి దూరం చేస్తాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూం వారి ప్రవర్తన పట్ల తరుచు సమీక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గాదె రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మారుతి అమరేందర్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ పివికె.రామన్, ప్రిన్సిపాల్ కెకె.జయరాజన్, డైరెక్టర్ జిన్సి జయరాజన్, హెచ్‌ఎం సుజయ్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

## పూర్తి కానున్న గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులు




**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని గుజ్జవాని కుంట తండాలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. శనివారం భవనం పైకప్పు (స్లాబ్) నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ గుగులోతు దూప్‌సింగ్ నాయక్ ప్రారంభించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పనులను పర్యవేక్షించారు. తండా వాసులకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పంచాయతీ భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పుపల్లి సర్పంచ్ గుండా సిద్ధులు, పంచాయతీ కార్యదర్శి రాంచందర్, వార్డు సభ్యులు గుగులోతు ఆలియా నాయక్, మాజీ వార్డు సభ్యులు దిరావత్ లింగా నాయక్, గ్రామస్తులు గుగులోతురవి నాయక్ పాల్గొన్నారు.

## నల్లగొండ మార్కెట్ చైర్మన్ పదవీ కాలం 6 నెలలు పొడగింపు

**మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన..జూకూరి రమేష్**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడగించారు.ఈమేరకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటిగా నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా తిప్పర్తి మండలానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రధాన అనుచరుడు జూకూరి రమేష్ కు అవకాశం దక్కింది.2024 మార్చి 12న నల్లగొండ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం బాధ్యతలు చేపట్టగా రెండు సంవత్సరాల పదవి కాలం ఈనెల 12న ముగిసింది.పాలకవర్గం పదవి కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగించడం పట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ పాలకవర్గం తరఫున మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## వేయరు.... వేస్తే ఆర్పారు...కోదాడ మున్సిపల్ సిబ్బంది తీరు...



**పట్టపగలు సైతం వెలుగుతున్న దీపాలు....**

ప్రజాపక్షం/కోదాడ: కోదాడ మున్సిపాలిటికి సరైన అధికారి లేక క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడి సమస్యలు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నాయి. పట్టణంలోని కొన్నివీధుల్లో అసలు వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతుంటే మరికొన్ని వీధుల్లో వేసిన దీపాలు అర్పకుండా ఉండటం మూలంగా విద్యుత్ వృధా అవుతుందని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు పట్టణంలోని 35 వార్డుల్లో సిసి రోడ్లు గత ప్రభుత్వ హాయంలో మిషన్ భగీరథ నల్లాల కోసం తవ్వకాలు చేయడంతో సిసిరోడ్లపై రోడ్డుకు అడ్డంగా మోకాలు లోతు గుంటలు ఏర్పడ్డాయి. కోదాడ నుండి అనంతగిరి వెళ్లే రోడ్డులో ఓ ప్రముఖ నాయకుడు, కాంగ్రెస్ నాయకుని ఇంటి ముందే మోకాలు లోతు గుంటలు ఉండటం గమనార్హం. గుంతలతో ఒళ్లు హూనం అవుతుందని జనాలు మొత్తుకుంటున్నా ఆ రోడ్డు ప్యాచ్ వర్క్‌కు నోచుకోకపోవడం విచారకరం.

కుర్చీకే పరిమితమైన మున్సిపల్ కమిషనర్

క్షేత్రస్థాయిలో పరిశీలనతో సిబ్బంది పనితీరును మెరుగుపర్చే కమిషనర్ కుర్చీకే పరిమితం అవుతుండటంతో సిబ్బందిలో నిర్లక్ష్యం పెరిగి సమస్యలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే విలేకరులు సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన పరిష్కరించని వైనం కోదాడ పట్టణంలో కనిపిస్తుంది.

## అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నల్లగొండలోని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో రేఖల మమత అంగన్‌వాడి టీచర్లను శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టులో ఉత్తమ సేవలు అందించిన సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడి టీచర్లు ఇంద్రపల్లి సైదమ్మ, మల్లీశ్వరి, సాయి, సుజిత, బొంధు పార్వతి, ఆయా విజయలక్ష్మిలను జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి హరిత శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు.



## నూతన దంపతులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి పట్టణానికి చెందిన సిపిఐ నాయకులు ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు కుమార్తె ఆకాంక్ష శ్రీకాంత్ వివాహం 12న భువనగిరిలో వైభవంగా జరిగింది. ఇతర కార్యక్రమాల కారణంగా వివాహానికి హాజరు కాలేకపోయిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం శనివారం భువనగిరి పట్టణం ప్రగతినగర్‌లోని శోభన్ బాబు నివాసానికి వెళ్లి నూతన వధూవరులను కలుసుకుని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ పాల్గొన్నారు.

## డిప్లొమా కోర్సుకు ఆహ్వానం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ హైదరాబాద్ 2026/27 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులు అడ్మిషన్లు నమోదు చేసుకోవాలి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా కోర్సు సంబంధించి 6 సెమిస్టర్లు ఉంటాయన్నారు. మొత్తం సీట్లు 60 ఉన్నాయన్నారు. 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ప్రవేశం పూర్తిగా 10వ తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా ఉంటుందన్నారు. ఇంటర్ (ఎంపిసి) పూర్తి చేసిన వారు నేరుగా రెండో సంవత్సరంలో చేరవచ్చని, గరిష్టంగా 23 ఏళ్లు ఉండాలని, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు 25 ఏళ్ల అర్హతలు ఉండాలన్నారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి నెలకు రూ.2,500 స్టైఫెండ్ తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందన్నారు. పూర్తి వివరాలకు klbiiht.telangana.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

## మారపాక మరణం న్యాయవాదులకు తీరనిలోటు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మారపాక వెంకన్న మరణం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు)కు తీరనిలోటని ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి అన్నారు. వెంకన్న గత రెండు నెలలుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా ఆయన పార్థివ దేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల కోసం వారి హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిన వెంకన్న లేకపోవడం తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ఏ రంగారావు, అనంత శంకరయ్య, యాదాసు యాదయ్య, కొంపెల్లి లింగయ్య, నూకల సుదర్శన్‌రెడ్డి, మోదుగు వెంకట్‌రెడ్డి, మాజీ మునిస్పల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట ఆర్యవైశ్యుల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని యువ వ్యాపారవేత్త బెలిదె శ్రీనివాసులు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుధాకర్ పివిసి కార్యాలయంలో సుధాకర్ పివిసి ఎండి, సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే సూర్యాపేట పట్టమ ఆర్యవైశ్య మహాసభకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పట్టణ అధ్యక్షుడిగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ ఉప్పల సత్యనారాయణ, సుధా బ్యాంక్ వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్, బిక్కుమల్ల కృష్ణ పాల్గొన్నారు.

# సిసిరోడ్ల పనుల్లో నాణ్యత లేకుంటే సహించేది లేదు

**ప్రజాపక్షం/తుర్కపల్లి** :మండల కేంద్రంలో సీసీ రోడ్డుకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.15 లక్షలు మంజూరు అయ్యాయని, నిర్మాణపనుల్లో రోడ్డును నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్నారని తుర్కపల్లి ఉపసర్పంచ్ పల్లె నరేష్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పన్నుల డబ్బుతో చేసే పనులు నాణ్యతతో చేయాలని, లేకపోతే సహించేది లేదని హెచ్చరించారు. ఈ విషయంపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఏఈకి ఫోన్ చేసినప్పటికీ ఆయన స్పందించడం లేదని ఉపసర్పంచ్ తెలిపారు. వెంటనే పనులను పరిశీలించి నాణ్యతతో రోడ్డును నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల తరపున ఆందోళనకు దిగాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు

# ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులని సర్పంచ్ ఆవేదన



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని సంగ్యతండా, ముల్కలపల్లి, పల్లెపహాడ్ వద్ద భువనగిరి నుండి గజ్వేల్, సిద్దిపేట వెళ్లే నేషనల్ రహదారిపై 161 రోడ్డు అనేక గుంతలమయంతో ఉన్నది గతంలో అనేకమంది ఇక్కడ ప్రాణాలు కోల్పోవడం జరిగిందని, గతంలో ఇక్కడ అనేక యాక్సిడెంట్లు జరిగినవి అయినా కానీ ఎవరు పట్టించుకోలేదు, అందుకే జేతురం తండా గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ తన సొంత నిధులతో మట్టిని తీసుకొని ఆ గుంతలను పూడ్చడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరవాలని తెలియజేశారు. మరో ప్రాణం పోకముందుకే ఈ రోడ్డుని మరమ్మతులు చేపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.

# నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** మండలంలోని నాయకుని తండాలో నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి శంఖుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.స్థానిక శాసనసభ్యులు కుందూరు జయవీర్ ఆదేశాల మేరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయితీ భవనానికి గ్రామ సర్పంచ్ మేరావత్ పూల బిచ్యాలు నాయక్ శంఖుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హచ్చు నాయక్, మాజీ సర్పంచ్ కొండా నాయక్,ఉప సర్పంచ్ మోతి లాల్,గ్రామ నాయకులు మునినాయక్,నాగేందర్ నాయక్,రంగసాయి,దేవుజా నాయక్,సేవా నాయక్,సక్రు నాయక్,స్వామి నాయక్,బాలచందర్,ముని తదితరులు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

## ఒక విద్యార్థి గైర్హాజరు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో పదవ తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని 12 కేంద్రాలను ఏర్పాటచేయగా పకడ్బందీ ఏర్పాట్ల నడుమ తెలుగు పేపర్ సజావుగా నిర్వహించారు. 12 కేంద్రాల్లో 2,863 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానుండగా ఒక విద్యార్థి పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈవో ధర్మానాయక్ తెలిపారు. పలు పరీక్షా కేంద్రాలను ఆయనతోపాటు నల్లగొండ జిల్లా డీసీఈబీ సెక్రటరీ స్వాడ్ అధికారులు కె.శ్రీనివాస్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వల్ల 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లను మూసివేశారు.

**ప్రజాపక్షం/దేవరకొండ;** శనివారం నుండి మొదలైన పదవ తరగతి పరీక్షలలో దేవరకొండలోని ప్రభుత్వ పాఠశాలలో 157 మంది విద్యార్థులు, జెడ్పి హైస్కూల్ బాలికల పాఠశాలలో 238 మంది విద్యార్థులు, జెడ్పి హై స్కూల్ బాలుర పాఠశాలలో 238 మంది విద్యార్థులు, కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో 240 మంది విద్యార్థులు, తెలంగాణ మోడల్





స్కూల్లో 221 మంది విద్యార్థులు, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో 229 మంది విద్యార్థులు మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు హాజరైనట్లు మండల విద్యాధికారి మాతృనాయక్ తెలిపారు.

**ప్రజాపక్షం/డిండి;** పదవ తరగతి పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. డిండి మండలంలోని 376 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు 375 మంది విద్యార్థులు పరీక్షకు హజరయ్యారని ఒక విద్యార్థి మాత్రమే పరీక్షకు హాజరు కాలేదని మండల విద్యాధికారి నర్సింహా తెలిపారు. ఈపరీక్షలు రెండు సెంటర్లలో జరుగుతున్నాయని ఆర్పీ ఆర్పీ గుండ్లపలి 175 మంది విద్యార్థులు, టిజిఎంఎస్ గుండ్లపల్లిలో 200 మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్ష రాసినట్లు తెలిపారు.

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు మొదటిరోజు శనివారం తెలుగు పరీక్షలు ప్రశాంతంగా రాశారు. మండల విద్యాధికారి నకరకంటి రవి విలేకరులతో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద పరీక్షలు పకడ్బందీగా జరిగేటట్లు ఏర్పాట్లు చేశామన్నారు. మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ ఏ పాఠశాలలో 209, ప్రాథమిక పాఠశాల బిలో 97 మొత్తం 306 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

# ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వం వెంటనే ప్రకటన చెయాలి

**ప్రజాపక్షం/ఆలేరు** : ఎన్నికల సందర్భంగా ఆలేరు రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన మాట ప్రకారం 100 రోజుల లోపు ఆలేరు రెవెన్యూ డివిజన్ కేంద్రం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రకటన రావాలని రెవెన్యూ డివిజన్ అఖిల పక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆలేరు పట్టణాన్ని రెవెన్యూ డివిజన్గా ఏర్పాటు చేసే అంశంలో ప్రభుత్వం మరియు స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని అఖిలపక్ష కమిటీ డిమాండ్ చేస్తూ శనివారం ఆలేరు పట్టణంలోని స్థానిక ఆర్యవైశ్య భవన్‌లో అఖిలపక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయంలో ఆలస్యం జరుగుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు హామీలు తర్వాత మౌనం ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల ప్రచార సభల్లో కూడా ఆలేరు రెవెన్యూ డివిజన్ త్వరలో ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రకటించారని తెలిపారు. ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గం పేరుకే ఉన్నప్పటికీ అభివృద్ధి పరంగా వెనుకబడిపోయిందని సమావేశంలో నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలేరు ప్రాంత అభివృద్ధి జరగాలంటే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అత్యంత అవసరమని వారు పేర్కొన్నారు. ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండాల్సిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఆర్ & బి కార్యాలయం, ఏసీపీ కార్యాలయం వంటి ప్రభుత్వ సంస్థలు ఇక్కడ ఏర్పాటు కాకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.



అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఇంటిగ్రేటెడ్ స్కూల్, మెడికల్ కాలేజ్, వంద పడకల ఆసుపత్రి వంటి అభివృద్ధి ప్రాజెక్టులు కూడా ఇతర ప్రాంతాలకు తరలించబడటం దురదృష్టకరమని విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా రెవెన్యూ డివిజన్ అంశంపై ఎమ్మెల్యేపై సరైన ఒత్తిడి తీసుకురావడం లేదని సమావేశంలో విమర్శలు వ్యక్తమయ్యాయి.

**ఉద్యమానికి హెచ్చరిక..** ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించిన అధికార ప్రకటన వెంటనే విడుదల చేయించాలని అఖిల పక్ష కమిటీ డిమాండ్ చేసింది. లేదంటే త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పసుపు నూరి వీరేశం, కో కన్వీనర్లు మొరిగాడి చంద్రశేఖర్, పుట్ట మల్లేష్, మధు, కామిటి కారి అశోక్, కెమిడీ ఉప్పలయ్య, కుర్షిద్ పాషా వడ్డేమాన్ నరేందర్, బాంబే రవి, కెమిడి ఉప్పలయ్య, ఎలుగల కుమారస్వామి, మంచన మల్లేశం, నెమలి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# హ్యాపీ సండే-ఫన్ డేకు సిద్ధమైన ఎన్‌జి కళాశాల మైదానం

**ప్రజాపక్షం/నల్గొండ టౌన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నల్లగొండ నగరంలో ఆదివారం హ్యాపీ సండేఫన్ డే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సిడిఎంఏ ఆదేశాల మేరకు నల్లగొండ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది.నగరంలోని ఎన్‌జి కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుంది.ఈ సందర్భంగా యోగాసనాలు,సాంస్కృతిక కార్యక్రమాలు,వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఉత్సాహం కలిగించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు.అలాగే మెప్మా మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ రకాల తినుబండారాలను కూడా ప్రదర్శనకు ఉంచనున్నారు.స్థానిక ప్రజలు,వాకర్స్,మహిళా సంఘాల సభ్యులు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# చండూరులో సివిల్ సప్లై-టాస్క్ ఫోర్స్ దాడులు

## 12 గ్యాస్ సిలిండర్లు పట్టివేత



**ప్రజాపక్షం/చండూరు:** జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు శనివారం చండూరు పట్టణంలో సివిల్ సప్లై,టాస్క్ ఫోర్స్ అధికారులు పలు హోటళ్లపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు.ఇతనిఖీలలో సుమారు రూ.26,400 విలువ గల 12 వంట గ్యాస్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.హోటళ్లలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచినట్లు గుర్తించిన అధికారులు వాటిని పట్టివేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.గృహ వినియోగానికి ఇచ్చే ఎల్పిజి గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించడం చట్ట విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు.అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచడం లేదా వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించడం గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్ అధికారులు హెచ్చరించారు.ప్రజలు,వ్యాపారులు గ్యాస్ వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ దాడుల్లో సివిల్ సప్లై మరియు టాస్క్ ఫోర్స్ అధికారులు దీపక్,ఆర్.సైదులు,డీటీసీ ఎస్ ఏ.సైదులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

**ప్రజాపక్షం/మోతె** : మండలంలోని వివిధ గ్రామాలలో చనిపోయిన కుటుంబాలను పరామర్శ చేయడానికి కోదాడ శాసనసభ్యులు పద్మావతి రెడ్డి హాజరవుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా శుభ కార్యాలయాలకు హాజరవుతారని వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు

# పరీక్ష ప్యాడ్లు, పెన్నులు బహూకరణ



**ప్రజాపక్షం/ఆలేరు** : ఆలేరు పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్ శనివారం విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష పాడ్స్, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో సాయితేజ, నరేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే

**ప్రజాపక్షం/మోటకొండూర్** : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం ఆయన మోటకొండూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆరెగూడెం, దిలావర్పూర్, ఇక్కుర్తి, మాటూరు, వర్టూరు, చందేపల్లి, చామపూర్, చాడ, ముత్తిరెడ్డిగూడెం, కాటేపల్లి తదితర గ్రామాలలో సుమారు 2 కోట్ల నిధులలతో సిసి రోడ్ల నిర్మాణాలకు, కోటి 50 లక్షలతో మహిళ సంఘ బందం కార్యాలయాల భవనాలకు, 50 లక్షలతో అంగన్ వాడి భవనాలు శంకుస్థాపనలు చేస్తూ, పలు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలలో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆలేరు నియోజకవర్గంను అభివృద్ధిలో ముందుంచుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిర, సబ్ రిజిస్టర్ తహసిల్దార్ కే.రాజేంద్రప్రసాద్, ఆర్ఐలు రామారావు, ఆసిఫ్, ఆలేర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ తండ



పాండు రంగయ్య గౌడ్, డాక్టర్ కంకాల ఎలెందర్, మండల పార్టీ అధ్య క్షులు గంగాపురం మల్లేష్ పాల్గొన్నారు.